

పిడుగు పడి నాలుగు పశువుల మృతి

ప్రజాశక్తి -అనంతగిరి: పిడుగు పాగుపాటుకు గుర్రై నాలుగు దుక్కెద్దులు మృతి చెందిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. ఈ నెల 22న శనివారం మధ్యాహ్నం భారీ పిడుగులతో వర్షం కురిసింది. దీంతో, మండలంలోని గరుగుబిల్లి పంచాయతీ పదపూతికవలస గ్రామానికి చెందిన ఓలుగు సింహాచలంకు చెందిన 3 పశువులు, రూడి సత్యనారాయణకు చెందిన ఒక్క దుక్కిటెద్దులు గ్రామానికి సమీపంలో మోత కోసం వెళ్లాయి. భారీ వర్షం కురవడంతో పశువులు సమీపంలో ఉన్న చెట్టు వద్దకు చేరాయి. ఆ సమయంలో పిడుగు పడటంతో మృతి చెందినట్లు రైతులు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

బతికేది ఎలా?

-మూడు నెలలుగా అందని వేతనాలు

-అవస్థలు పడుతున్న ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు

ప్రభుత్వాలు ఎన్ని మారినా ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదు. కార్మికులు చాలీ చాలని వేతనంతో పాటు, ఇచ్చే కొద్దిపాటి వేతనం కూడా నెల నెలా చెల్లించకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. తమ కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి ఎన్నో అవస్థలు పడవలసిన పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి- అరకులోయ: ఎన్నికల ముందు ప్రభుత్వాలు కార్మికుల జీవితాలు బాగు చేస్తామని హామీలు ఇస్తున్నారు తప్పా. అది ఆచరణలో పెట్టకపోవడంతో కార్మికుల జీవితాలు దిన దిన గండంగా ఉంది. ప్రతిరోజు ఎవరు చేయని పనులు చేస్తూ అర్ధాకలతో గడుపుతుండటంపై పలువురు ప్రభుత్వాల తీరుపై తీవ్రంగా విమర్శిస్తున్నారు. నూతన ప్రభుత్వమైన వేతనాలు చెల్లించాలని ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు.

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 31 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 22 మంది స్త్రీలు, 9 మంది పురుషులు పారిశుద్ధ కార్మికులుగా పనిచేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఈ వేతనంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు నిత్యం అర్ధాకలి, అప్పుల బాధ తప్పడం లేదు. ఇప్పటికి మూడు నెలల వేతనం చెల్లించవలసి ఉంది.

ఇచ్చే కొద్దిపాటి వేతనం కూడా తమకు ఇవ్వకపోతే తామెలా బతుకుతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏరియా ఆసుపత్రిలో 16 మంది సెక్యూరిటీలు పని చేస్తున్నారు. సెక్యూరిటీ నిర్వహణ టెండర్ పాడిన కాంట్రాక్టర్ సక్రమంగా వారికి వేతనాలు చెల్లించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలల కాలం నుంచి బకాయి వేతనాలు ఉండి పోయిందని వారు వాపోయారు. రాత్రి, పగలు ఆస్పత్రిలో పనిచేస్తున్న తమకు సక్రమంగా వేతనాలు చెల్లించక పోవడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడేరు, ముచ్చంగిపుట్టు, చింతపల్లి ఆస్పత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీల పరిస్థితి కూడా ఇదే మాదిరిగా ఉందని కార్మికులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం, కాంట్రాక్టర్ నెలవారీగా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.



నిరసన చేపడుతున్న ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు (ఫైల్ ఫోటో)

కనీస వేతనాలు ఇవ్వాలి

ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి. ఆస్పత్రి లోపల అన్ని రకాల పనులు చేస్తున్న వారికి కనీస వేతనాలు పెంచాలి. వీరికి కేటాయించిన పనులు కాకుండా మిగతా పనులు కూడా చేస్తుంటారు. పని ఒత్తిడి తగ్గించాలి. అరకు ఏరియా ఆసుపత్రికి పారిశుద్ధ్యం విషయంలో స్టేట్ అవార్డు కూడా వచ్చింది. చాలీచాలని వేతనంతో కాలం వెలదీస్తున్నారు.



ఉమామహేశ్వరరావు.
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

అప్పుల పాలవుతున్నాం

తమకు టెండర్ పాడిన కాంట్రాక్టర్ నెల నెల వేతనాలు చెల్లించకపోవడంతో నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి పగలు డ్యూటీలు చేసిన ఫలితం శూన్యం. ఇచ్చే కొద్దిపాటి వేతనాలు కూడా నెలల తరబడి నుంచి బకాయి ఉంచితే తామెలా బతుకుతాం. బతికేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా చూస్తే బాగుంటుంది. కొత్త ప్రభుత్వ హయాంలోనైనా కార్మికులకు నెలవారిగా వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం .

రఘు.
ఏరియా ఆసుపత్రి సెక్యూరిటీ కార్మికుడు

నేషనల్ పార్క్‌ను సందర్శించిన సిసిఎఫ్



వాలమూరులో జంగిల్ స్టార్ సందర్శనలో సిసిఎఫ్ చిరంజీవి చౌదరి

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మండలంలో ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ చిరంజీవిచౌదరి ఆదివారం పర్యటించారు. పాపికొండల నేషనల్ పార్క్ ప్రాంతమైన జిఎం వలస పంచాయతీ పిండికూరు వలస ప్రాంతాన్ని సందర్శించారు. డబ్ల్యూఎల్ఎం రంపచోడవరం రేంజ్ పరిధిలో చేపట్టిన రాక్ పిల్ డ్యాములు, పెర్క్యులేషన్ ట్యాంకులు, సాసర్ పిట్స్ వంటి ఎస్ఎంసి పనులను పరిశీలించారు. అనంతరం అటవీ శాఖలో పనిచేస్తున్న గిరిజన యువకులతో మాట్లాడారు. బేస్ క్యాంప్‌లో పనిచేస్తున్న సహాయకులకు సోలార్ లైట్లు, దోమతెరలు, బూట్లు, వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పిండుకూరువలస నుండి కొండమొదలు గ్రామం వరకు ట్రెక్కింగ్ చేసి సహజ అటవీ ప్రాంతంలో వేగిసా వంటి చెట్లతో పాటు కొన్ని స్థానిక జాతులను గుర్తించారు. ప్రత్యక్ష లేదా పరోక్ష సాక్షాలు అంటే పగ్ మార్క్స్, స్కాట్ మొదలైన వన్యప్రాణుల పర్యవేక్షణపై స్థానిక గిరిజనులతో సంభాషించారు. ట్రాప్ కెమెరా లొకేషన్‌లను పరిశీలించారు. లేపోర్డ్ ఇండిన్ గార్, సాంబార్, బార్కింగ్ డీర్ వంటి ట్రాప్ కెమెరా చిత్రాలను పరిశీలించారు.

మారేడుమిల్లిలోని వనవిహారి సిబిఇటిని, వాలమూరులో ఉన్న జంగిల్ స్టార్ రిసార్ట్స్‌ను పరిశీలించారు. జంగిల్ స్టార్‌లో కాంటెంట్ విస్తరణ సావనీర్ షాప్, స్థానిక జాతులను ప్రోత్సహించడం ద్వారా పచ్చదనాన్ని మెరుగుపరచాలని సూచించారు. వనవిహారి, జంగల్ స్టార్ రిసార్ట్స్‌లో జరుగుతున్న పనులను కాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిసిఎఫ్ రాజమండ్రి శ్రీనివాసరెడ్డి, రంపచోడవరం డిఎఫ్ఒ నరేంద్రియన్, రాజమండ్రి స్క్వాడ్ డిఎఫ్ఒ తిరుమూర్తి రెడ్డి, రంపచోడవరం రేంజర్ షేక్ ఫిరోజ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కిషోర్ బాబు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్

విద్యార్థులకు 90 డేస్ ప్రత్యేక పునాది అభ్యసనం- 'ప్రజాశక్తి'తో జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మజీరావు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు నేను బడికి పోతా కార్యక్రమం ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారి పి బ్రహ్మజీరావు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలపై "ప్రజాశక్తి"కిచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే..





బడిలో చేర్పించేందుకు ప్రణాళిక

జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,572 ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఏడాదిలో బడి బయట ఉన్న పిల్లలు గతంలో డ్రాపవుట్ అయిన పిల్లలు కలుపుకొని సుమారు 2000 మంది పిల్లల్ని బడిలో చేర్పించే లక్ష్యంగా గుర్తించాం. అంగన్వాడీ కేంద్రాల నుంచి బడిలో చేరే పిల్లల కోసం నేను బడికి పోతా కార్యక్రమం ద్వారా బడిలో ప్రవేశం కల్పిస్తున్నాం. జులై 12 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. బడి బయట పిల్లలు లేకుండా గ్రామాలను జీరో చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

ఉపాధ్యాయుల ఖాళీ, భర్తీ

జిల్లాలో ఉన్న పలు ప్రాథమిక పాఠశాలలో టీచర్ల కొరత ఉన్న పరిస్థితి వాస్తవమే. ప్రస్తుతం తాత్కాలిక పద్ధతిపై ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి డిప్యూటేషన్ పై నియమకాలు చేస్తున్నాం. ప్రతి పాఠశాలలో కొత్తగా చేరే విద్యార్థులకు 90 రోజుల ప్రణాళికతో ప్రత్యేక పునాది అభ్యాసన కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రప్రథమంగా పాఠశాలల్లో చేరే పిల్లలకు "విద్యా ప్రవేశ్ "పేరుతో సంసిద్ధత కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

ప్రత్యేక పునాది అభ్యాసన వివరాలు

పిల్లలకు బేస్ లైన్ టెస్ట్, ఎండ్ లైన్ టెస్ట్ లు నిర్వహిస్తూ, 90 రోజుల ప్రత్యేక పునాది అభ్యాసన కార్యక్రమం కొనసాగించనున్నాం.

పుస్తకాల పంపిణీకి చర్యలు?

జిల్లాలో అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ నూరు శాతం పూర్తి చేసాం. జిల్లాకు ఇండెంట్ ప్రకారం 7,73,170 నోట్స్ పుస్తకాలు సరఫరా పూర్తి చేసాం. అలాగే ఇండెంట్ ప్రకారం 14,06,386 పాఠ్యపుస్తకాలకు గాను 11,39,173 పంపిణీ పూర్తయింది. డిక్షనరీలు 38384 పంపిణీ జరగాల్సి ఉండగా ఇప్పటివరకు 4571 మాత్రమే వచ్చాయి.

యూనిపామ్, బ్యాగుల సరఫరా..

యూనిఫామ్ 167454 చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు166938 పూర్తయింది. బెల్టులు అందరికీ సరఫరా పూర్తయింది. బ్యాగులు167454 ఇండెంట్ కాగా ఇప్పటివరకు 81,905 సరఫరా పూర్తయ్యింది. షూస్ 167102 ఇండెంట్ కాగా ఇప్పటి వరకు103176 సరఫరా పూర్తి చేసాం. ప్రతి విద్యార్థి కొలతలు తీసుకుని షూస్ ఆర్డర్ పెట్టి రప్పిస్తున్నాం.

బ్యాడ్మింటన్ టోర్నీకి విశేష స్పందన



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పిఒ, సబ్‌కలెక్టర్, ఎఎస్‌పి

ప్రజాశక్తి-రంపచోడవరం :అల్లూరి సీతారామరాజు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఠాగూర్, బుల్లిదొర మెమోరియల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు క్రీడాకారుల నుండి విశేష స్పందన వచ్చినట్లు కన్వీనర్ నాగేంద్ర, సెక్రెటరీ సురేష్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అభిషేక్ తెలిబీవనఱ. ఏజెన్సీ 11 మండలాలతో పాటు రాజమండ్రి, గోకవరం, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని నుండి 70జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీ ఈనెల 20న ప్రారంభం కాగా, 25వరకు నిర్వహించనున్నారు. నాకౌట్ పద్ధతిలో నిర్వహించే టోర్నీలో పాల్గొనే దూరప్రాంతాల నుంచి వస్తున్న క్రీడాకారులకు అల్పాహారం, మంచినీటి వసతి ఏర్పాటు చేస్తున్నామని, పేక్షకులకు చూసేందుకు అనువుగా ఇండోర్ స్టేడియం బయట మ్యాచ్ లైవ్ టెలికాస్ట్ ఇస్తున్నామని తెలిపారు. టోర్నీ నిర్వహణకు అనుమతులిచ్చి ఆర్థికసాయం చేసిన రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఎఎస్‌పి, డిఎఫ్ఒలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీలకు నిధులు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపిపి పెంటయ్య

ప్రజాశక్తి-కూనవరం : గ్రామ పంచాయతీలు, మండలాలకు రావాల్సిన నిధులను ప్రభుత్వాలు వెంటనే పునరుద్ధరించాలని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య కోరారు. ఆదివారం మండలంలోని కూటూరు గ్రామంలో సమావేశంలో మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌ద్వారా గ్రామాల్లో ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని అందించే చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామాల్లో వీధి రోడ్లకు ఎన్‌ఆర్ఇజిఎస్ నిధులను కేటాయించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉందని, మండలంలోని శిథిలావస్థకు చేరిన, భవనాలు లేని పాఠశాలలకు అవసరమైన వసతి కల్పించాలని కోరారు. కొండాయిగూడెం పాఠశాల అధ్వానస్థితిపై మూడేళ్లుగా ఆందోళనలు, రాస్తారోకోలు, పలుమార్లు వినతులుఇచ్చినా కనీస స్పందన లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చిన ఆర్థికసంఘం, ఇతరత్రా నిధులను ఇప్పటివరకు ఇతర వ్యవహారాలను దారిమళ్లించిన నేపథ్యంలో వాటన్నింటినీ పంచాయతీల ఖాతాలకు జమ చేయడంతోపాటు ముమ్మందు సజావుగా కేటాయింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, ఎంపిటిసిలుఅమ్మాజి, జయసుధ, సర్పంచులు నాగమణి, వెంకమ్మ పాల్గొన్నారు.

చెట్టు కూలి ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పోలీసుస్టేషన్ పరిధిలో బోర్నగూడెం గ్రామ సమీపంలో ఏలేశ్వరం, జడ్డంగి ప్రధాన రహదారిపై ఆదివారం భారీవక్షం నేల కూలింది. దీంతో గంటల తరబడి రహదారిపై రాకలపోకలు నిలిచిపోయాయి, విషయం తెలుసుకున్న జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు సిబ్బందితో అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్నా చెట్టును తొలగించి, రాకపోకలు పునరుద్ధరణకు కృషి చేశారు. ఈ సందర్భంగా పోలీసుల చొరవను పలువురు అభినందించారు. పోలీస్ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.



కూలిన చెట్టు తొలగింపు పనుల్లో పోలీసులు

నేడు ఎంపీ తనూజారాణి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అరకులోయ: అరకు పార్లమెంటు సభ్యురా లుగా నూతనంగా ఎన్నికైన డాక్టర్ గుమ్మ తనూజారాణి ఈనెల 24న సోమవారం పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోడలు, వైసిపి రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ సతీమణి తనుజరాణి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అరకు ఎంపీగా గెలుపొందారు. ఈ మేరకు ఆమె దేశ రాజధాని ఢిల్లీ పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆమె విలేకరులకు తెలిపారు. ఆమెకు వైసిపి శ్రేణులు అభినందనలు తెలిపారు. తనను గెలిపించిన అరకు నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



పొంచివున్న ప్రమాదం

-తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలు

-ఆందోళనలో బూరువలస గ్రామస్తులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పట్టాం పంచాయతీ బూరువలస గ్రామంలో విద్యుత్ స్తంభాలు కింది భాగం తుప్పు పట్టి ఉన్నా పట్టించుకునే నాథుడే లేదు. దీంతో, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. 2007లో బూరువలస గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. సుమారు 17 ఏళ్ల కావడంతో విద్యుత్ స్తంభాల కింద భాగం దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వర్షాలకు గాలి వీయడంతో చుట్టూ పక్కన ఉన్న ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిత్యం మరమ్మతుకు గురవుతోర్దఇ. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు రాజారావు, బి.బుద్రన్న, కె.నూకరాజు, బి.చిన్నయ్య, ఆనంద్ తదితరులు కోరుతున్నారు.



తుప్పు పట్టిన స్తంభం



దెబ్బతిన్న విద్యుత్ స్తంభం కింద భాగం

మట్టిదారి కాదిది.. తారురోడ్డే..!

- అధ్వానంగా అద్దరవీధి - పందిరాయి రహదారి
- మరమ్మతులు చేయాలని పలుమార్లు వేడుకోలు
- అయినా పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు



రూపుకోల్పోయిన అడ్డరవీధి తారురోడ్డు



అద్దర వీధి, కంపుమానపాక మధ్యలో గోతులమయమైన రోడ్డు

ప్రజాశక్తి -సీలేరు : ఈ ఫొటోలో కలిపిస్తున్న రహదారి మట్టిరోడ్డు అనుకుంటే పొరబడినట్లే. అది మట్టిదారి కాదు.., తారురోడ్డే. పనుల్లో నాణ్యత లేకపోవడం, ఈ ఐదేళ్లలో మరమ్మతులు చేపట్టకపోవడంతో మట్టిదారిని తలదన్నేలా ఈ తారు రోడ్డు తయారైంది. రహదారి మొత్తం గోతులు పడి, వర్షపు నీరు చేరి బురదమయంగా ఉంది. గుత్తేదారుడు నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ కొరవడంతో తారు రోడ్డు వేసిన కొన్నాళ్లకే గోతులమయంగా మారింది.

అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మండలం అద్దర వీధి నుంచి పందిరాయి వరకు ఐదేళ్ల క్రితం తారురోడ్డు నిర్మాణం చేశారు. ప్రస్తుతం ఈ రహదారి శిధిలావస్థకు చేరుకుని, పెద్ద పెద్ద గోతులు పడి, వర్షపు నీరు చేరి మట్టి రోడ్డు కంటే అధ్వానంగా ఉంది. ప్రధానంగా అద్దర వీధి నుంచి కాంపుమానపాక వరకు పూర్తిగా మట్టిదారిలా మారింది.

గుత్తేదారుడు అత్యాశతో రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంతో కనీసం పర్యవేక్షణ చేయలేదని, అందువల్లే రహదారి ఇలా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తారురోడ్డు బురదమయంగా మారడంతో అస్తవ్యస్తంగా ఉన్న ఈ దారిలో ప్రయాణానికి వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రవాణాకు తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. చినుక పడితే వాహనాలపై రాకపోకలు సాగించలేని స్థితి నెలకొంది. దీంతో ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రజలు నానా అవస్థలకు గురికావాల్సి వస్తోంది. రహదారి గోతులు పడినప్పుడే మరమ్మతులు చేయాలని అనేక సార్లు ఆర్ అండ్ బి అధికారులను వేడుకున్నామని, అయినా వారు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఈ రహదారి అధ్వానంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు శ్రద్ధ చూపి రహదారికి ప్యాచ్ వర్క్ చేసి ఉంటే రహదారి సౌకర్యం కొంత మెరుగ్గా ఉండేదని పలువుర అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు స్పందించి ఈ రహదారిని పునర్నిర్మాణం చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వర్షంతో వారపుసంతకు ఇక్కట్లు



సీలేరులో వర్షంతో బోసిపోయిన వారపుసంత

ప్రజాశక్తి -సీలేరు: భారీ వర్షం కారణంగా వారపు సంతకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీలేరులో ఆదివారం ఉదయం నుంచి తొమ్మిది గంటల వరకు వర్షం కురవడంతో వారపు సంతకు దూర ప్రాంతాల నుంచి గిరిజనులు రాలేని పరిస్థితి నెలకొంది. రెండు మూడు వారాల నుంచి సీలేరు పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురవక అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం ఉదయం పూర్తిస్థాయిలో మేఘావతమై వర్షం కురవడం వ్యాపారాలు జరగక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. చుట్టుపక్కల నుంచి వచ్చిన గిరిజన మాలీలు సంతకు తెచ్చిన కూరగాయలు విక్రయాలు చేయలేక అవస్థలు గురయ్యారు. వర్షం కారణంగా స్థానిక ప్రజలు ఎపిజెన్‌కో ఉద్యోగుల కుటుంబాలు కూరగాయలు, నిత్యవసర సరుకులు కొనేందుకు సంతకు రాకపోవడంతో వారపుసంత వెలవెలబోయింది. వర్షం తగ్గిన తర్వాత సంతలో వ్యాపారాలు సాగకపోవడంతో వ్యాపారులు ఉసూరుమన్నారు. చుట్టుపక్కల నుంచి గిరిజనులు రాకపోవడంతో వారపు సంత బోసిపోయింది.


ఇటుకల తయారీ పరిశ్రమను ప్రారంభిస్తున్న సర్పంచ్ రమేష్

ఇటుకల తయారీ పరిశ్రమ ప్రారంభం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని సుజనకోట పంచాయతీ పాత సుజనకోట గ్రామంలో నీడా ఇంజినీరింగ్ వర్క్స్ పై యాస్ మినీ ఇటుకల తయారీ పరిశ్రమను స్థానిక సర్పంచ్ వి.రమేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఇటుకల తయారీ పరిశ్రమ తీసుకురావడం ఆనందదాయకమని, దీంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కలుగుతుందని తెలిపారు. ఇటుకల తయారీ మినీ పరిశ్రమ యజమానురాలు రుక్మిణి మాట్లాడుతూ, గిరిజనులకు నాణ్యమైన ఇటుకలను అతి తక్కువ ధరలకు అందిస్తామన్నారు. 20 రకాల ఇటుకలను ఆర్డరుపై తయారీ చేస్తామని ఆమె అన్నారు. పూర్తి సమాచారం నిమిత్తం ఫోన్: 6300432686, 7981262749 నెంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మరణాలపై ఆందోళన వద్దు

నేడు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు: చుట్టుమెట్టలో ఇద్దరు మరణం పట్ల ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా సూచించారు. గ్రామస్తుల భయాందోళనల నేపథ్యంలో ఈనెల 24న సోమవారం గ్రామంలో డిఎంహెచ్ఓ ఆధ్వర్యంలో సైకియాట్రిస్ట్, క్లినికల్ సైకాలజిస్ట్‌తో పాటు వైద్యుల బృందంతో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి గ్రామ ప్రజలందరికీ పరీక్షలు చేస్తామన్నారు. రక్తపోటు, షుగర్, హెచ్‌బి, సికిల్ సెల్ పరీక్ష, మలేరియా పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తామన్నారు. చుట్టు మెట్ట గ్రామ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. ఇద్దరి మరణానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తామని డిఎంహెచ్ఓ వివరించారు.

పరిశ్రమల ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ ప్రచురించిన నోటిఫికేషన్‌కు సంబంధించి, సిఆర్‌జెడ్ పరిధి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించిన తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్‌చేశారు. 2019 సిఆర్‌జెడ్ నోటిఫికేషన్ కింద నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్లి, ఎస్.రాయవరం, అచ్యుతాపురం, పరవాడ మండలాలకు సంబంధించి సిఆర్‌జెడ్ ముసాయిదాపై జులై 23న అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రకటన ఇచ్చారన్నారు. దీనిపై ముందుగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఇప్పటికే సిఆర్‌జెడ్ ప్రాంతాల్లో హెటిరో డ్రగ్స్, డెక్కన్, పరవాడలో ఫార్మాసిటీ వంటి కాలుష్యం కలిగిస్తున్న పరిశ్రమలు ఉన్నాయని, 2011/2019 సిఆర్ జెడ్ నోటిఫికేషన్ల అమలు తేదీ నుంచి నిషేధించబడినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇటువంటి పరిశ్రమలతో జలవనరులు, కాలుష్యానికి గురై ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన పరిశ్రమలకు కఠినమైన పెనాల్టీలు వేయడమే కాకుండా, ప్రజలకు తగిన నష్టపరిహారం వారిచేత ఇప్పించాలని కోరారు. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ప్రభుత్వం సేకరించిన భూములలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తుందన్నారు. కాలుష్యం కలిగించే యూనిట్లను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, ఏపీసి జెడ్ ఎమ్ఏ వారు 2011/2019 సి ఆర్ జెడ్ నోటిఫికేషన్లను చిత్తశుద్ధితో అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు పోకుండా గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీ.దేముడునాయుడు, ఎం.రాజేష్, కె.సోమునాయుడు, బి.నాగేశ్వరరావు, సిహెచ్.శివాజీ, ఎం.బైరాగిరాజు, రామకృష్ణ ఎం.రమణ, నారాయణ పాల్గొన్నారు.

నిరుపయోగంగా బోరు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండల కేంద్రంలోని సంత వలస అంగన్వాడి కేంద్రంలో నిర్మించిన తాగునీటి బోరు గత కొన్ని నెలలుగా మరమ్మతుకు గురై నిరుపయోగంగా మారింది. దీంతో అంగన్వాడి కేంద్రంలో తాగునీటి సౌకర్యం లేక నిర్వాహకులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడి కేంద్రానికి వెళ్లే చిన్నారులకు పౌష్టికాహారాన్ని వండి పెట్టడానికి బయట నుంచి మంచినీళ్లు తీసుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గత కొన్ని నెలల నుంచి బోరు నిరుపయోగంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు మరమ్మత్తు చేసి వినియోగంలో తీసుకు రావడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానిక గ్రామస్తులు అంటున్నారు. ప్రస్తుత ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రం వద్ద తాగునీటి బోరును మరమ్మత్తు చేపట్టకపోతే మారుమూల గ్రామాల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చని పలువురు అంటున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి మూలన పడిన తాగునీటి బోరును మరమ్మత్తు చేసి వినియోగంలో తీసుకురావాలని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు.


మరమ్మతుకు గురైన బోరు

శ్రమదానంతో రోడ్డు నిర్మాణ పనులు


రోడ్డు నిర్మాణానికి చదును పనులు చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి: శ్రమదానంతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఆదివాసీలు నడుం బిగించారు. మండలంలోని రోంపలి పంయాయతీ బూరిగ గ్రామం నుండి వనిజ గ్రామానికి 8 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి ఆదివాసీలు పూనుకున్నారు. మండలంలోని రొంపిల్లి పంచాయితీ బూరిక, చిన్నకోనేల గ్రామాల్లో 74 కుటుంబాలు 170 మంది జనాభా ఉంది. కొండ శిఖరం గ్రామంలో నివశిస్తున్నారు. రేషన్ బియ్యం, ఆసుపత్రికి వెళ్లాలంటే 12 కిలోమీటర్ల మేర కొండ కోనల నడుమ కాలి నడకన వెళ్ళవలసి వస్తుంది. గర్భిణీలను డోలీలో తీసుకొని వెళ్లవలసిన ఉంటుంది. రోడ్డు సమస్య పరిష్కారానికి బూరుగ గ్రామం నుండి విజయనగరం జిల్లా మెంటాడ మండలం వనజ గ్రామం వరకూ 8 కిలోమీటర్ల దూరం శ్రమదానంతో రోడ్డు నిర్మాణానికి పనులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో బూరుగ పెంటయ్య, సోముల ఎర్రయ్య, సోమల కోత్తయ్య, రొంపిల్లి పంచాయతీ వార్డ్ సభ్యుడు సోముల అప్పలరాజు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని కొర్రాయి పంచాయతీ బురిడివలస గ్రామంలో ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద నిర్మిస్తున్న మల్టీపర్పస్ సెంటర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కొర్రాయి సర్పంచ్ పి.కొములు సూచించారు. ఆదివారం ఆ గ్రామంలో సర్పంచ్ సందర్శించి భవన నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ 60 లక్షలు మంజూరు చేసి నిర్మిస్తున్న అంగన్వాడి సెంటర్, హెల్త్ సెంటర్ కమ్యూనిటీ హాల్ తొందరగా పూర్తిచేయలన్నారు. లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ ఉప సర్పంచ్ వి.జగన్నాథం, అల్లూరి జిల్లా హ్యూమన్ రైట్స్ బురిడీ విక్రమ్ దేవ్, గిరిజన సంఘం మండల నాయకులు వి.రామూర్తి పాల్గొన్నారు


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ కోములు

నేరాలు ఘోరాలు

బైక్ బోల్తా : మహిళకు గాయాలు

ప్రజాశక్తి - పెదబయలు: బైక్ బోల్తా పడిన ఘటనలో మహిళకు గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు... మండలంలో లక్ష్మి పేట కప్పాడ గ్రామానికి చెందిన పాంగి రామయ్య భార్య పాంగి కొనే (40) అనారోగ్యంతో బాధపడుతోంది. ఆదివారం అల్లూరి జిల్లా పాడేరు హాస్పిటల్‌లో చికిత్స పొంది తిరుగు ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. అరడ కోట పంచాయతీ చుట్టూమెట్ట సెల్ టవర్ సమీపంలో కుక్క అడ్డుగా వచ్చింది.దీంతో బైక్ అదుపు తప్పి మెయిన్ రోడ్డుపై ఇద్దరు పడ్డారు. ఈ ఘటనలో ఆమెకు గాయాలయ్యాయి. ప్రెస్ క్లబ్ సభ్యులు ఎఎన్ఎంతో ప్రథమ చికిత్స చేయించి పెదబయలు హాస్పిటల్ కు ఆటోలో తరలించారు.


గాయపడిన పాంగి కొనే

172 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని నేరాలవలస పంచాయతీ పరిధి చిన్నపురం జంక్షన్ పప్పుల మిల్లు వద్ద శనివారం సాయంత్రం అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... అందిన సమాచారం మేరకు పద్మనాభం పోలీసులు, సిటీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. కారులో వెళ్తున్న నలుగురు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు పట్టుకొని విచారించారు. వారి వద్ద 172 కిలోల గంజాయి లభ్యమైంది. తునికి చెందిన బొండలపు అప్పారావు, బొదల సురేష్, చింతమనేని రాజా, అరకుకు చెందిన మజ్జి రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 172 కిలోల గంజాయిని, కారును, ఐదు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస శివారు ప్రాంతంలో బహిరంగంగా పేకాట ఆడుతున్న 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఆనందపురం సిఐ తిరుపతిరావు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 52 పేక ముక్కలు, రూ.10,030 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐలు సంతోష్, శివ, రైటర్ గాంధీ, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం దుక్కవానిపాలెం శివారు ప్రాంతంలో కోడి పందేలు ఆడుతున్న వారిపై పోలీసులు దాడులు చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు బైకులు, రెండు కోడి పుంజులు, రూ.10,100 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సిఐ టివి.తిరుపతిరావు తెలిపారు. ఎస్ఐలు సంతోష్, శివ, రైటర్ గాంధీ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రమణయ్యపేట లో పాడి రైతు సిహెచ్ పోలయ్యకు చెందిన గేదె విద్యుత్ షాక్ కు గురై మృతి చెందింది. పోలయ్య గేదెలు మేపుతుండగా వేలాడుతున్న విద్యుత్తు తీగలు తగలడంతో సుమారు 80 వేల రూపాయల విలువైన పాడిపశువు విద్యుత్ షాక్ గురై మృతి చెందడంతో పాడి రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు.

కొత్తకోటలో వాసవి వనితా క్లబ్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది వాసవి వనితా క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్బంగా వాసవి క్లబ్ ఇంటర్నే షనల్ సభ్యుల నిధులతో ఐదుగురు చిరు వ్యాపారులకు గొడుగులు, 20 మంది విద్యార్థులకు స్టేషనరీ కిట్, నోట్ బుక్స్ పెన్స్, పెన్సిల్స్ తఅందజేశారు. ట్రాఫిక్ పోలీసులకు మాస్కులు, టవల్స్ వితరణగా అందించారు.


లంకపాకల వద్ద అర్ధరాత్రి కారడవిలో నిలిచిపోయిన ఆర్‌టిసి బస్సు

కండిషన్ లేని బస్సులతో కష్టాలు

- అర్ధరాత్రి అడవిలో ప్రయాణికుల అగచాట్లు!
- సాంకేతిక సమస్యతో నిలిచిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - సీలేరు : విశాఖ నుంచి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే అల్ట్రా డీలక్స్ నైట్ సర్వీస్ ఆర్‌టిసి బస్ శనివారం అర్ధరాత్రి సాంకేతిక సమస్య తలెత్తడంతో కారు అడవిలో కటిక చీకట్లో నిలిచిపోయింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రతిరోజు విశాఖపట్నం కాంప్లెక్స్‌లో సాయంత్రం 6 గంటలకు బయలుదేరి, సీలేరు మీదుగా భద్రాచలం మరుసటి రోజు ఉదయం 4 గంటల చేరుకునే ఆర్‌టిసి బస్సు, శనివారం సాయంత్రం యథావిధిగా బయలుదేరి రాగా, గూడెం దాటిన తర్వాత లంకపాకల ఘాట్ రోడ్డులో బస్సులో సాంకేతిక లోపాలు తలెత్తి కారడవిలో నిలిచిపోయింది. దీనిపై డ్రైవర్లు అప్రమత్తమై సాంకేతిక లోపాలు పరిశీలించారు. బస్సు ఇంజను, వైరింగ్‌లో సాంకేతిక లోపాలు ఉన్నట్లు గుర్తించి, వాటికి మరమ్మతులు చేపట్టారు. గంటన్నర తర్వాత యథావిధిగా సీలేరు మీదుగా భద్రాచలం వరకు బస్సు వెళ్లడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కాలం చెల్లిన అల్ట్రా డీలక్స్ బస్సులను ఆర్‌టిసి ఏజెన్సీ ప్రాంతంలో రాత్రివేళ నడుపుతూ అధిక ఛార్జీలు వసూలు చేయడమే కాకుండా ప్రజలను అగచాట్లు పాల్జేస్తున్నారని స్థానికులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నైట్ సర్వీసుల బస్సులను కండిషన్ ఉన్నవాటిని తిప్పేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు తరచూ ఘాట్‌రోడ్డులో ఇటువంటి సమస్యలే తలెత్తుతున్నా ఆర్‌టిసి యాజమాన్యం పట్టించుకోకపోవడందారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. . విశాఖపట్నం వయా సీలేరు మీదగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సులు కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు.

26న టిడిపి విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఎమ్మెల్యేగా కూటమి బలపరిచిన టిడిపి అభ్యర్థిగా విజయం సాధించి, అసెంబ్లీలో ప్రమాణస్వీకారం అనంతరం ఈనెల 26న నియోజకవర్గానికి వస్తున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిని ఘనంగాస్వాగతించేందుకు కూటమి శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి.ఉదయం 9 గంటలకు సీతపల్లి బాపనమ్మ ఆలయానికి చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు అనంతరం, రంపచోడవరం గంగవరం అడ్డతీగల మీదుగా రాజవొమ్మంగి వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ప్రజా సంక్షేమంపై దృష్టి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపి కూటమి ప్రభుత్వ హయాంలో కక్ష సాధింపు చర్యలు ఉండవని, ప్రజా సంక్షేమంపైనే ప్రధాన దృష్టి ఉంటుందని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, జిల్లా ప్రధాన కార్యదర్శి గణగళ్ల సత్య, కేదార లక్ష్మి, తోట శ్రీదేవి అన్నారు. చంద్రబాబుకూ, జగన్‌కూ మధ్య ఉన్న తేడా ప్రజలకు అర్థమవుతోందని తెలిపారు. ఆదివారం సాయంత్రం టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో ఒక బాధితురాలు అత్యాచారానికి, హత్యకు గురవడం దురదృష్టకరమన్నారు. సంఘటన జరిగిన వెంటనే సిఎం చంద్రబాబు స్పందించి హోం మంత్రి అనితకు ఆదేశాలు ఇవ్వడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం తరుపున రూ.10 లక్షలు అందించారన్నారు. గత ప్రభుత్వంలో ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు అప్పటి వైసిపి ప్రభుత్వం ఇలా స్పందించిన దాఖలాలులేవన్నారు. రాష్ట్రంలో ఉన్న తమది ప్రజా ప్రభుత్వమని అన్నారు. ప్రతి జిల్లాలో వైసిపి కార్యాలయాలను అక్రమంగా నిర్మించారని, ప్రజాధనం దుర్వినియోగం చేశారని అన్నారు.



పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు దోపిడీ పర్వానికి తెరతీశాయి. ప్రభుత్వ నియంత్రణ కరువవడంతో ఫీజుల దందాను కొనసాగిస్తున్నాయి. పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ ధరలనూ విపరీతంగా పెంచేసి తమ గల్లా పెట్టెను నింపుకుంటున్నాయి. ఎక్కడికక్కడ నిబంధనలకు పాతరేస్తున్నాయి. వెరసి ఫీ'జులుం'కు విద్యార్థుల తల్లిదండ్రులు హడలెత్తిపోతున్నారు.

ఫీజుల దందా

- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా వసూళ్లు
- పుస్తకాల పేరిట ఎడాపెడా బాదుడు
- లబోదిబోమంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - ఆనందపురం, విశాఖపట్నం

జిల్లాలో 1387 పాఠశాలలు ఉండగా 781 ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోనే నడుస్తున్నాయి. ప్రభుత్వ లెక్క ప్రకారం ఒకటి నుంచి పదో తరగతి వరకూ ఆయా పాఠశాలల్లో 3,91,736 మంది ఈ విద్యాసంవత్సరం చదువుతున్నారు. వీరిలో 2 లక్షలా 96 వేల మంది ప్రైవేటు స్కూళ్లలోనే విద్యనభ్యసిస్తున్నారు. ఫీజుల వసూళ్లపై నియంత్రణ లేకపోవడంతో సదరు ప్రయివేట్ యాజమాన్యాల దోపిడీకి అంతేలేకుండా పోయింది. పరీక్షల్లో ఫలితాలు, పేరెంట్స్ అర్హతను బట్టి యాజమాన్యాలు ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నాయి. ఆనందపురం వంటి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రయివేట్ స్కూళ్లలో సైతం ఫీజులు అధికంగానే ఉన్నాయి. ఎల్‌కెజి విద్యార్థికి గరిష్ఠంగా రూ.40 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఆ మండలంలో ప్రముఖ ప్రైవేటు విద్యాసంస్థల బ్రాంచిలన్నీ దాదాపు ఉన్నాయి. కార్పొరేట్ స్థాయి పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థికి డేస్కాలర్ అయితే రూ.75 వేల వరకు, రెసిడెన్షియల్ విద్యార్థి అయితే రూ.2 లక్షల వరకూ ఫీజు వసూలు చేస్తున్నారు. మిగతా ప్రైవేట్ పాఠశాలల్లో రూ.20 వేల నుంచి 30 వేల వరకూ ఫీజులు తీసుకుంటున్నారు. పుస్తకాలను తమ పాఠశాలలోనే కొనాలని డిమాండ్ చేస్తూ ఒక్కొక్క విద్యార్థి నుంచి సుమారు రూ.10 నుంచి రూ.12 వేలు వరకూ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ పుస్తకాలు మినహా విద్యార్థికి సంబంధించిన ఇతర పుస్తకాలు, నోట్ బుక్స్ తమ స్కూళ్లలో కొనాల్సిందేనని యాజమాన్యాలు హుకుం జారీ చేశాయి. బయట మార్కెట్‌తో పోలిస్తే పలు ప్రయివేట్ స్కూళ్లలో ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ తల్లిదండ్రులు తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే కొంటున్నారు. ఒకటో తరగతి విద్యార్థికి సుమారు పదకొండు వేల వరకు పుస్తకాలకు ఖర్చువుతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబో మంటున్నారు.

కానరాని ఫీజుల పట్టిక

ఫీజుల పట్టికను కచ్చితంగా అమలు చేయాల్సి ఉన్నా అది ఎక్కడా అమలు కాని పరిస్థితి నెలకొంది. పలు పాఠశాలల్లో కనీసం బోర్డు కూడా కానరాని పరిస్థితి. ఫీజుల పేరుతో ఇంతలా దోచేస్తున్నా కనీసం జిల్లా విద్యాశాఖ అధికారులుగానీ, మండల విద్యాశాఖ అధికారులుగానీ అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

అధికారులకు ముడుపులు ముట్టడంతోనే ఇలా చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫీజుల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం!

ఎక్కడికక్కడే దర్శనమిస్తున్న వ్యర్థాలు
కనీస ఫలితమివ్వని నిషేధ ఆంక్షలు
ప్రజల్లో చైతన్యానికి వనవాసి సంస్థ కృషి

పజాశక్తి-మారేడుమిల్లి: పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న రంపచోడవరం ఏజెన్సీలోని మారేడుమిల్లి గ్రామం, విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగంంతో కాలుష్యకారకమై పోతుండడంపై సర్వత్రా ఆందోళన, ఆవేదన వ్యక్తమౌతోంది. గతంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు ప్లాస్టిక్ వాడకం నిషేధమని నోటీసులు ఇచ్చినప్పటికీ, అచరణలో కనీసస్థాయిలో అమలు జరగని పరిస్థితి ఉంది. అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ, వ్యాపారులు, వినియోగదారులు విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడటంతో ఆరుబయట, రోడ్ల పక్కన ఎక్కడికక్కడే వాడిపడేసి ప్లాస్టిక్ కవర్లు, సంచులు దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ వినియోగంపై ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎంతగానో ప్రజల్లో అవగాహనను కల్పిస్తున్నా, దానికి ప్రజల నుంచి కనీస సహకారం లేదని దీన్ని బట్టి స్పష్టమౌతోంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల భూభౌతిక కాలుష్యంతోపాటు భూగర్భ జలాల కూడా కలుషితమైపోతున్నాయి ప్లాస్టిక్ నిషేధ ఉద్యమంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములైతేగానీ దీనికి చెక్ పడే పరిస్థితి లేదని పలువురు భావిస్తున్నారు.

అంతేకాక వాడిపడేసిన ప్లాస్టిక్‌ను మూగజీవాలు తినేయడం వల్ల అవి అనారోగ్యం పాలై మృత్యువాత పడే పరిస్థితి ఉందని స్వచ్ఛందసంస్థలు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వనవాసి స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ అధ్యక్షులు గొర్లె అనుదీప్ కుమార్ అంటున్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా ప్రత్యామ్నాయంగా, పర్యావరణ హితమైన ఎన్నో మార్గాలు అందుబాటులో ఉన్నాయని, వాటన్నింటినీ వాడడం ద్వారా పర్యావరణాన్ని కాపాడేలా ప్రజలను చైతన్యవంతం చేస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణతోనే సకాలంలో వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు, జీవజాలంతోపాటు భూమి మనుగడ సాధిస్తుందని ప్రజలకు వివరిస్తున్నట్లు అనుదీప్‌కుమార్ తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న కస్తూర్బా పాఠశాలల గెస్ట్ ఫ్యాకల్టీ

కాంట్రాక్ట్ టీచర్స్‌గా తీసుకోవాలి

- డిఇఒ, జిసిడిఒలకు కస్తూర్బా పాఠశాలల గెస్ట్ ఫ్యాకల్టీ వినతి

ప్రజాశక్తి - ఎటపాక : ఆరేళ్లుగా గెస్ట్‌టీచర్స్‌గా పనిచేస్తున్న తమను కాంట్రాక్ట్ టీచర్స్‌గా తీసుకొని, కొనసాగించాలని పాడేరు డిఇఒ, జిసిడిఒలకు కస్తూర్బా పాఠశాలల గెస్ట్ టీచర్లు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కసుర్బాగాంధీ బాలికా విద్యాలయాలలో 2016నుంచి గెస్ట్ టీచర్స్‌గా పనిచేస్తున్న తమను రెండు దఫాలుగా రంపచోడవరంలో, కాకినాడలో కౌన్సిలింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి డిఇఒ సమక్షంలో డెమోక్లాస్ నిర్వహించి, చూపిన ప్రతిభ ఆధారంగానే అదికారులు గెస్ట్ టీచర్స్‌గా నియమించారన్నారు. భవిష్యత్‌లో కొనసాగిస్తామని అప్పట్లో హామీనిచ్చిన అధికారులు, తర్వాత ఏటా తమను డిస్‌కంటిన్యూ చేసి, తర్వాత నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేస్తున్నారన్నారు. ఈక్రమంలోనే కొందరిని పక్కకు తప్పించి, అంతగా అనుభవం లేనివారిని గెస్ట్‌ఫ్యాకల్టీగా తీసుకుని ఆరేళ్లుకు పనిచేస్తున్న తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు.

రెగ్యులర్ టీచర్స్ సిఆర్‌టిలతో సమానంగా నైట్ డ్యూటీలు, సండే డ్యూటీలు, పండగ డ్యూటీలు, స్టడీ అవర్స్ నిర్వహిస్తూ, సంబంధిత సబ్జెక్టులతో శతశాతం ఫలితాలను తీసుకొచ్చిన తమను విస్మరించడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను కాంట్రాక్టు ఫ్యాక్టల్టీగా విధుల్లోకి తీసుకుని కొనసాగించాలని వేడుకున్నారు. దీనిపై స్పందించిన అధికారులు, గెస్ట్‌ఫ్యాక్టల్టీ వినతిని పరిశీలించి, తగు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎటపాక, కూనవరం, విఆర్ పురం, వై రామవరం కస్తూర్బా పాఠశాలల గెస్ట్ టీచర్స్ కుమారి, వనజ, చంద్రమ్మ, పద్మశ్రీ, శాంతిలత, రామలక్ష్మి, పద్మ, సీతమ్మ ఉన్నారు.

విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు సభ్యులకు 12 శాతం డివిడెంట్ చెల్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు సభ్యులకు 12 శాతం డివిడెంట్ చెల్లిస్తామని బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ప్రకటించారు. ఆదివారం మద్దిలపాలెం సమీపంలో కాకతీయ కల్చరల్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన బ్యాంకు 109వ వార్షిక మహాజన సభలో ఆయన ఈ ప్రకటన చేశారు. డివిడెంట్ 12 శాతం చొప్పున రూ.38 కోట్లా 79 లక్షల రూపాయలు చెల్లించనున్నట్లు తెలిపారు. బ్యాంకు డైరెక్టర్ మానం ఆంజనేయులు ప్రసంగిస్తూ పేదలు, సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు పెరిగే విధంగా రుణాలు మరింతగా అందజేసే విధంగా బ్యాంకు ఆలోచన చేయాలన్నారు. బ్యాంకు అభివృద్ధికి సుదీర్ఘ సేవలు అందించిన ఆంజనేయులు రాజీనామాను ఈ సభలో ఆమోదించారు. బ్యాంకు డైరెక్టర్ జెవి.సత్యనారాయణమూర్తి ప్రవేశపెట్టిన సంప్రదింపుల కమిటీల ఎన్నికపై తీర్మానాన్ని ఆమోదించారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బ్యాంకు బైలా నిబంధనలలోని 37 (ఎ)లో నియమాల ప్రకారం బ్రాంచిల సర్వసభ్య సమావేశాలలో సంప్రదింపుల కమిటీ ఎన్నిక జరుపుకుంటున్నామని తెలిపారు. సభ్యులకు, మేనేజర్లకు మధ్య వారధిలా సంప్రదింపుల కమిటీలు పనిచేస్తాయన్నారు. బ్యాంకు డైరెక్టర్ సి.కృష్ణమోహన్‌రావు అనుబంధ సంస్థ ఏర్పాటుపై ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశంలో ఆమోదించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ అనుబంధ సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా సంక్షేమ పథకాలన్నింటినీ ఆ సంస్థ ద్వారా నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో చార్టెర్డ్ అకౌంటెంట్, డైరెక్టర్ వి.చంద్రశేఖర్, సీనియర్ వైస్ చైర్మన్ గుడివాడ భాస్కరరావు, డైరెక్టర్లు ఎస్.నాగభూషణ చౌదరి, ఎజె.స్టాలిన్, ఎన్.కామరాజు, కె.భవాని, జి.జనార్ధనరావు, సిహెచ్.ఆదినారాయణ శాస్త్రి, ఎస్.జానకి రామచంద్రరాజు, వెంకట రమణారావు, కె.ప్రసాదరావు, పార్వతీదేవి, కోటేశ్వరరావు, నారాయణస్వామి, రామకృష్ణారావు, బాబూరావు, సిఇఒ పివి.నరసింహమూర్తి పాల్గొన్నారు.